

# 12. సాలెపురుగు - ఈగ

**నేపథ్యం:** పొగడ్తలకి పొంగరాదు తెగడ్తలకి కుంగరాదు దీనిని పాటిస్తే ఏ సమస్యల్లో ఇరుక్కోము, బాధపడము. ఈ మార్గములో నడిచిన ఈగ గురించి చదువుదామా!



"ఈగమ్మ! ఈగమ్మ! ఇంట్లోకి రావమ్మ
మా మేడలో గలవు మంచి చిత్రాలు
చూడవేడుక పుట్టు సొగసైన చోద్యాలు
ఎన్నెన్నో గలవమ్మ ఎగిరిరావమ్మ!" (1)

"ఎగిరి వెళ్ళినవారు దిగలేరు నీ మేడ
మేడ ఎక్కగ నేల? మెట్టు లెక్కగ నేల?
చూడనక్కరలేదు చోద్యాలు మీ ఇంట
నీవు పిలవడమేల? నేను రానమ్మ" (2)




"నట్టింట ఫలహారం అట్టె పెట్టాను
ఫలహారమును జేసి పడుకోవె ఈగ
పట్టెమంచము పరుపు పరచి ఉంచాను
చుట్టురా దోమతెర కట్టి ఉందమ్మ." (3)

"నీవు పెట్టిన తిండి నేను తినలేనమ్మ
నీ పట్టె మంచాల నిద్ర పోలేనమ్మ
నా మీద నీకింత ప్రేమ గలుగగ నేల
నీవు పిలవడ మేల? నేను రానేల?" (4)

ఇట్లెంత పిలిచినా ఈగమ్మ రాదనుచు
సాలీడు ఈగమ్మ సౌందర్య మెంచి... (5)

**సొంతవాక్యాలు:–** ● మేడ ● ఫలహారం ● పట్టెమంచం ● వర్ణించు



"ఎంత చక్కని కనులు ఎంతెంత చక్కని రెక్కలు
ఎంత చక్కగ నీవు ఎగురు చుండుదువు
ఎంత చక్కని కాళ్ళు! ఎంతెంత చక్కని ఒడలు
ఎంత చక్కని దానవు ఈగమ్మ! నీవు" (6)

"మిద్దెపై ఉన్నదొక పెద్దద్దమందులో
ముద్దు లొలికెడు నీదు మొగము కనవమ్మ!" (7)



అని యిట్లు సాలీడు తన చక్కదన మెంచి
పొగిడి వర్ణించగా పొంగిపోలేదు.
దొంగ మాటల కప్పుడు లొంగిపోలేదు
సాలీడు పట్టుపై వ్రాలనూ లేదు. (8)

తెలివితో ఆ ఈగ ఎగిరి పోయింది
తెలివి పారక సాలీడు నోరెళ్ల బెట్టింది. (9)

## I. వినండి–సంభాషించండి.

1. నువ్వు ఎప్పుడైనా నీ అవసరం కోసం ఎవరినైనా పొగిడావా?
2. పొగడ్తలకు పొంగిపోయి మోసపోయిన వారి కథ నీకు తెలుసా?
3. మీరు పాఠశాలకు వెళ్తున్నారు. ఎవరో కొత్త వ్యక్తి ఒక బాలునికి చాక్లెట్లు ఇస్తున్నాడు. అప్పుడు ఏం చేస్తే బాగుంటుంది – చర్చించండి.

## II. కొత్త పదాలు తెలుసుకుందాం.

**అర్థాలు:–**

వేడుక = సంతోషం;
సొగసైన చోద్యాలు = అందమైన విచిత్రాలు;
ఎంచి = మెచ్చుకొని; ఒడలు = శరీరం;
నట్టింట = ఇంటిమధ్య; మిద్దె = మేడ;
కనవమ్మ = చూడవమ్మ

**భావాలు:–**

1. ఈగమ్మా! ఈగమ్మా! మా ఇంట్లోకి రావమ్మా. చూడటానికి వినోదం కల్గించే ఎన్నో సొగసైన చిత్రాలు మా మేడలో ఉన్నాయి.
2. మీ మేడలోకి వచ్చినవారు మళ్ళీ దిగి రాలేరు. రావటం ఎందుకు మీ ఇంటిలో చిత్రాలు నేను చూడక్కరలేదు. నీవు ఎందుకు పిలుస్తావు నేను రాను.
3. ఓ ఈగా! నట్టింట్లో నీ కోసం ఫలహారం పెట్టాను. నీ కోసం పట్టె మంచం పరుపు

వేసి ఉంచాను. చుట్టూరా దోమ తెర కట్టి వుంది. ఫలహారం చేసి పడుకో.

4. నీవు పెట్టిన తిండి నేను తినలేను. నీవు వేసిన పట్టె మంచం మీద నిద్రపోలేను. నీకు నా మీద ఇంత ప్రేమ ఎందుకు కలిగిందో? నీవు పిలవడమెందుకు? నేను రాను.

5.6. ఇట్లా పిలిస్తే ఈగ రావట్లేదని సాలీడు తలచింది. అప్పుడు దాని అందాన్ని పొగడటం మొదలుపెట్టింది. ఓ ఈగమ్మా! నీ కండ్లు ఎంత బాగున్నాయి, నీ రెక్కలు ఇంకా ఎంతో బాగున్నాయి. నీవు చక్కగా ఎగురుతావు. నీ కాళ్ళు ఎంత బాగుంటాయో? నీ శరీరం ఎంత బాగుందో నువ్వు ఎంతో అందమైన దానవు.

7. ఓ ఈగమ్మా! మేడలో ఒక పెద్ద అద్దము ఉన్నది. అందులో ముద్దులొలికే నీ ముఖం చూచుకో! ఈ విధంగా సాలీడు ఎంతో పొగిడింది. సాలీడు దొంగ మాటలకు ఈగ పొంగిపోలేదు. సాలీడు గూడుపై వ్రాలలేదు.

8.9. ఈగ తెలివిగా అక్కడ నుంచి ఎగిరిపోయింది. తన తెలివి పని చేయలేదని సాలీడు అవాక్కయిపోయింది.

## III. వినండి-ఆలోచించండి-రాయండి.

### అ. సరియైన పదాన్ని ఎన్నుకొని రాయండి.

1. మిద్దెపై ఉన్నది ————
   (అ) పెద్ద అద్దం (ఆ) పెద్ద పరుపు
   (ఇ) పెద్ద మంచం (ఈ) పెద్ద దోమతెర
2. నట్టింట పెట్టినది ————
   (అ) భోజనం (ఆ) ఫలహారం
   (ఇ) పానీయం (ఈ) పులిహోర
3. సాలీడు పొగడ్తలకు ఈగ ————
   (అ) పొంగిపోయింది (ఆ) పొంగిపోలేదు
   (ఇ) గూడుపై వాలింది (ఈ) గూడుపైవాలలేదు

### ఆ. ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి.

1. సాలీడు ఈగను ఎందుకు పిలిచింది?
2. సాలీడు ఈగకు ఫలహారం ఎక్కడ పెట్టింది?
3. ఈగ రావట్లేదని సాలీడు ఏం చేసింది?
4. 'ఈగ-సాలీడు' పాఠం నీతి ఏంటి?

### ఇ. మూడు, నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఈగ సాలీడు ఆహ్వానాన్ని ఏ విధంగా తిరస్కరించింది?
2. సాలీడు ఈగ అందాన్ని ఏ విధంగా వర్ణించింది?
3. తెలివిగా ఈగ సాలీడు నుంచి ఏ విధంగా తప్పించుకుంది?

## IV. భాషావగాహన

### 1. కింది వాక్యాలకు తగిన విరామ చిహ్నాలను పెట్టండి.

1. నీవు పిలవడ మేల నేను రానమ్మ
2. ఎంత చక్కని కాళ్ళు
3. నీ కళ్ళు రెక్కలు ఎంత అందంగా ఉంటాయి
4. నేను రానేల

### 2. విభక్తి ప్రత్యయాలను గుర్తించి, పట్టికలో రాయండి.

| | ప్రత్యయం | విభక్తి |
|---|---|---|
| 1. మా మేడలో గలవు మంచి చిత్రాలు | | |
| 2. ఫలహారమును చేసి పడుకోవె ఈగ | | |
| 3. తెలివితో ఆ ఈగ ఎగిరిపోయింది. | | |

## V. గ్రంథాలయ సమయం:-

1. 'పంచతంత్రం కథలు', 'అక్బర్-బీర్బల్ కథలు', 'తెనాలి రామలింగడు' కథలు చదవండి.
2. మీకు నచ్చిన కథను సొంతవాక్యాల్లో రాయండి. మిత్రులకు చెప్పండి.

**భాష-గమ్మత్తు:**

గబగబా చదవండి.

లక్ష భక్ష్యములు
భక్షించు లక్ష్మయ్యకు
ఒక్క భక్ష్యము లక్ష్యమా!




## VI. సృజనాత్మకత

**కథను సంగ్రహంగా ఆకృతిలో చూపించిన విధంగా రాయండి. పాఠంలోని పాత్రలు - వాటి గుణగణాలు**

| పాఠం పేరు |
|---|
| |

| పాత్రలు | - గుణగుణాలు |
|---|---|
| 1. | |
| 2. | |
| కథ ● ప్రారంభం | |
| ● కథా వికాసం | |
| ● ముగింపు | |
| ● నీతి | |

**భాష గమ్మత్తు**



ఏనుగు నల్లన. ఏనుగు



తెల్లన. ఏనుగు మీద




ఎంతో చక్కని దేవుడు

వానపాట పూరిద్దాం - పాడుదాం

| | | |
|---|---|---|
| నల్లని | | మూగెనురా |
| ఫెళ ఫెళ | | ఉరిమెనురా |
| బెక బెక | | అరిచెనురా |
| జల జల | | కురిసెనురా |

పైరు పంటలు పండెనురా
అందరి ఆకలి తీరెనురా.



ఏనుగు పాటను రాయండి.



**నేనిది తెలుసుకున్నాను:**

- పొగడ్తలకు పొంగిపోరాదు.

